భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# వర్తమాన రాజకీయ పరిస్థితి

2017 ఏప్రిల్ 18–19, కేంద్ర కమిటి సమావేశంలో

ఆమోదించిన తీర్మానం

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి

# రాజకీయ పరిణామాలపై రిపోర్టు

*(ఏప్రిల్ 18-19, 2017 కేంద్ర కమిటి*
*సమావేశంలో ఆమోదింపబడినది)*

# అంతర్జాతీయం

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

గత కేంద్ర కమిటీ సమావేశంలో విశ్లేషించిన విధంగానే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 నాటి ఆర్థిక సంక్షోభం తరువాత చెప్పుకోదగినంతగా కోలుకుంటున్న దాఖలాలులేవు. ఓ.ఇ.సి.డి. మార్చి 2017లో వెలువరించిన ఇంటెరిమ్ గ్లోబల్ అవుట్‌లుక్ రిపోర్టు ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2009 తరువాత అతి తక్కువ వేగంతో అంటే 2016లో 3 శాతాకన్నా తక్కువగా వృద్ధి చెందుతుందని అంచనా. వృద్ధి రేటు సంక్షోభానికి ముందున్న రెండు దశాబ్దాల కాలంలోని చారిత్రిక సగటు రేటు 4% కన్నా తక్కువగా ఉంది. ఏప్రిల్ 2017లో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచ వృద్ధిరేటు మందకొడిగా ఉంటుంది. జీవనప్రమాణాలకు కీలకమైన చోదకశక్తిగా నిలిచే ఉత్పాదనవృద్ధి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత ఘోరంగా పడిపోయింది. కోలుకునేందుకు అవకాశాలు చాలా తక్కువ అనేది ఐ.ఎమ్.ఎఫ్ అంచనా. అదే సమయంలో 1990 దశకం నాటి అభివృద్ధి చెందిన దేశాల వృద్ధిరేటుకు గానీ, 2000 దశకం మధ్యలోని అభివృద్ధి చెందుతున్న దేశాల వృద్ధి రేటుకు గానీ చేరుకునే అవకాశం లేదని ఈ రిపోర్టు అంచనా. ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాలు WESP సంస్థ, 2008 నాటి సంక్షోభం కారణంగా కొనసాగుతున్న మందగతి ఆర్థికవృద్ధి రేటు నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బయట పడలేదని, 2017 లో నిర్ధారించింది. (WESP-World Economic Situation Prospects) ఆందోళన కలిగించే అంశమేమిటంటే గత రెండేళ్లుగా కర్బనపు ఉద్గారాల విడుదల తగ్గలేదు. అదే సమయంలో పునరుత్పాదక ఇంధన

రంగాలలో కొత్త పెట్టుబడులు 2016 మొదటి ఆర్థిక భాగంలో దారుణంగా పడిపోయాయి. గత మూడు దశాబ్దాలలో ఇంత తక్కువగా పెట్టుబడులు రావడం ముందెన్నడూ జరగలేదు. పెద్ద ఎత్తున కర్బన ఉద్గారాల విడుదల ప్రపంచ వాతావరణ మార్పులకు ప్రమాదకరమైనది. అంతర్జాతీయ వాణిజ్యం కుదించుకుపోవడం అనేది ప్రపంచ ఆర్థిక మాంద్యానికి ఒక సూచికే కాదు దానికి కారణాలలోని ఒక అంశం కూడా. (2016లో పెరుగుదల మూడు దశాబ్ధాలలోనే అతి తక్కువగా 1.2%గా నమోదయ్యింది.)

## పెరుగుతున్న అంతరాలు

కొనసాగుతున్న ప్రపంచ మాంద్యం, పెట్టుబడిదారీ సంక్షోభం కారణంగా దేశాలలోని పేద, ధనికుల మధ్య అంతరాలు, దేశాల మధ్య అంతరాలు కూడా పెరిగాయి. మనం ఇదివరకు విశ్లేషిస్తూ వచ్చిన విధంగా లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకునేందుకు చేసిన ప్రయత్నాల ఫలితంగానే ప్రపంచీకరణ, అంతర్జాతీయ బలాబలాల పొందిక సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారింది. ఇందుకు సోవియట్ పతనంతోడయింది. మన 20వ మహాసభల సైద్ధాంతిక తీర్మానంలో పేర్కొన్న విధంగా నయా ఉదారవాద విధానాల అమలుతో ఇవన్నీ వేటాడే స్వభావం గల ఆదిమసంచయన లక్షణాలను సంతరించుకున్నాయి. 1990ల ప్రారంభం నుండి జి.డి.పిలో శ్రమ వాటా ప్రపంచ వ్యాప్తంగానూ అలాగే వివిధ దేశాలలోనూ గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఐ.ఎమ్.ఎఫ్ వెలువరించిన 2017 ప్రపంచ ఆర్థిక అంచనాల రిపోర్టును చూస్తే 1991-2014 మధ్య కాలంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన 50 దేశాలలోని 29 దేశాలలో శ్రామికుల వాటా తగ్గింది. 2014లో ప్రపంచ జి.డి.పిలో ఈ యాభై దేశాలు మూడింట రెండు వంతుల వాటాని కలిగి ఉన్నాయి. పారిశ్రామిక రంగం చూస్తే పదింట ఏడింటిలో ఆదాయంలో శ్రామికులవాటా పడిపోయింది. పెట్టుబడిదారీ విధానం ప్రతి సంక్షోభం నుండి బయటపడడానికి ప్రజలపై దోపిడీని తీవ్రతరం చేస్తుందనే విషయాన్ని ఇది స్పష్టం చేస్తున్నది. ఆందోళనకరమైన ఈ అసమానతలు భారత దేశంలోనూ చోటు చేసుకుంటున్నాయి.

## ట్రంప్ అధ్యక్షుడిగా

లాస్ ఏంజిల్స్ టైమ్స్ తన సంపాదకీయంలో డొనాల్డ్ ట్రంప్ మొదటి 70 రోజులపాలనను బేరీజు వేస్తూ అమెరికన్ పౌరుల అనుభవాలను ఈ విధంగా పేర్కొంది. ఇంత పెద్ద దుర్ఘటనను ఎదుర్కొనేందుకు మేం సంసిద్ధులుగా లేము. లక్షలాదిమంది అమెరికా పౌరులలాగానే మాలో కూడా ఒక చిన్న ఆశాకిరణం మిణుకు మిణుకుమంటూ మెరుస్తూ ఉండింది. ఈతని అరుపులు తాటాకు చప్పుళ్ళేనని, శ్వేత సౌధంలోని ఆయన సహచరులు ఆయన విపరీత ధోరణులను సవరిస్తారని, ఆయన బాధ్యతలు ఆయనను మృదువుగా మలుస్తాయని

ఆశించాం. కాని 70 రోజులు పైగా గడిచిన తరువాత,(ఇంకా 1400 రోజులపైగా మిగిలి ఉన్నాయి) మా ఆశలన్నీ అడియాశలేనని తేలిపోయింది.

గత కేంద్ర కమిటీ సమావేశంలో ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ప్రజలలో ఆందోళనలు నెలకొనడమేకాక, అమెరికా విదేశాంగ విధానంలో అనిశ్చితి కూడా వస్తుందని మనం గుర్తించాము. ఇవి ఈ రోజున నిజమౌతున్నాయి. ఆయన అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే జాతీయ రక్షణ సలహాదారుగా ట్రంప్ నియమించిన వ్యక్తి రాజీనామా చేయాల్సివచ్చింది. ఆయన ఎంచుకున్న ఇతర కేబినెట్ వ్యక్తులు కూడా చాలా పెద్దఎత్తున వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. పచ్చిమితవాద ఎజండాతో వలసవాదులకు వ్యతిరేకత, మహిళలపట్ల మైనారిటీస్ పట్ల పౌర హక్కులపట్ల చులకన, ఇస్లాంమతం పట్ల ద్వేషంతో ఆయన కాంపెయిన్ సాగింది. ఇవన్నీ వర్ణ వివక్ష దాడులకు దారితీస్తున్నాయి. వలస వచ్చిన వారిపై దాడులు పెరుగుతున్నాయి. ఒక భారతీయ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాల్చివేయబడ్డాడు. ఇంకొకరికి గాయాలయ్యాయి. అమెరికాలోని అనేక ప్రాంతాలలో భారతీయులపైన, ఆఫ్రో అమెరికన్స్‌పైన, లాటిన్ అమెరికా దేశీయులపైనా, ముస్లింలపైన దాడులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రంప్ వలసలకు వ్యతిరేకంగా ఇస్లామిక్ దేశాలను లక్ష్యంగా చేసుకుంటూ ఉత్తర్వులనిచ్చాడు. ట్రంప్ ఉత్తర్వులకు తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. కోర్టుల్లో ఉత్తర్వులకు వ్యతిరేకంగా కేసులు వేసారు. ట్రంప్ తన ఉత్తర్వులను మార్చుకోవాల్సి వచ్చింది. కాని మార్పు చేసిన ఉత్తర్వులను కూడా కోర్టు కొట్టివేసింది.

వృత్తి నిపుణులకిచ్చే హెచ్1బి వీసాల జారీపై కూడా ఆంక్షలు పరిమితులు విధించాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. భారతీయ ఐటి కంపెనీలు, అమెరికాలో పనిచేస్తున్న భారతీయులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 5 లక్షల భారతీయ వృత్తి నిపుణులు అమెరికాలో పనిచేస్తున్నారు. భారతీయులలోఉన్న అభద్రతను తొలగించడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని భారత ప్రభుత్వం పార్లమెంట్‌కు హామీనిచ్చినా, రోజురోజుకు అనిశ్చిత అభద్రత భారతీయులలో పెరుగుతున్నది.

అమెరికా అంతరంగిక విషయాలకు వస్తే, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించబడే నిధులను ట్రంప్ తగ్గించారు. మిలటరీకి కేటాయింపులను పెంచారు. అమెరికా–మెక్సికో సరిహద్దులలో గోడ నిర్మాణానికి నిధులను కేటాయించారు. మెడికల్ ఇన్సురెన్స్ చట్టాన్ని (ఒబమా కేర్) రద్దు చెయ్యాలని ట్రంప్ ప్రయత్నించినా, ఆ విషయంలో విజయం సాధించలేకపోయారు. కార్మిక వర్గాల నుంచి పేద ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత వల్ల ట్రంప్ ఈ విషయంలో విఫలం అయ్యాడు. ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత రిపబ్లికన్‌లలో కూడా చీలిక తీసుకువచ్చి వారిని వెనుకడుగువేసేట్లు చేసింది.

విదేశాంగ విధానాల కొస్తే, ప్యారిస్ పర్యావరణ మార్పు శిఖరాగ్ర సదస్సులో కార్బన్ పుట్‌ప్రింట్ తదితరాలు తగ్గించుకోవడానికి అమెరికా ఇచ్చిన హామీని రద్దు చేస్తున్నట్లుగా ట్రంప్ ప్రకటించారు. ట్రాన్స్ ఫసిపిక్ పార్ట్‌నర్‌షిప్ (టిపిపి) ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లుగా ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో వివిధ దేశాలతో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలను మెరుగుపర్చుకోవడానికి, దేశీయంగా రక్షణపూరిత విధానాలను అవలంబించడానికి ట్రంప్ ప్రాధాన్యతనిస్తున్నారు.

అమెరికా చరిత్రలో డొనాల్డ్ ట్రంప్‌లాగా అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి ఇంత స్వల్ప కాలంలోని ప్రజాదరణ కోల్పోవడం అరుదు. ట్రంప్ పదవీస్వీకరణ సమయంలోనే ఆయన చేపట్టబోతున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. నిరసన ప్రదర్శనలలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. కళలు, సాంస్కృతి రంగాలకు చెందిన ప్రసిద్ధులు ఈ నిరసన ప్రదర్శనలలో పాల్గొనడం విశేషం. మహిళల నిరసనలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

మోడి–ఒబామాలు కుదుర్చుకున్న ఒప్పందాలు భారతదేశాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి ఒక విధేయ మిత్రదేశంగా చేసాయి. డొనాల్డ్ ట్రంప్ కాలంలో ఇవి ఏ రకంగా పరిణామం చెందుతాయో చూడాలి. బిజెపి కేంద్ర ప్రభుత్వం మాత్రం భారతదేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదపు జూనియర్ భాగస్వామ్య దేశంగా మార్చడానికి ఉత్సుకతను చూపిస్తున్నది.

## అమెరికా సైనిక దుందుడుకుతనం

సిరియా ప్రభుత్వం రసాయన ఆయుధాలు ఉపయోగిస్తుందన్న నెపంతో సిరియా వాయు స్థావరాలపై క్షిపణి దాడులకై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోద ముద్ర వేసాడు. సిరియాపై 59 తొమహాక్ క్షిపణులను అమెరికా ప్రయోగించింది. ఇది చాలా సిగ్గుమాలిన ఆక్షేపణీయమయిన మిలటరీ జోక్యం. రష్యా వెంటనే దీనిని ఖండించింది. అసత్యమయిన కుంటి సాకుతో ఒక సార్వభౌమ దేశంపై చేసిన దాడిగా దీన్ని రష్యా అభివర్ణించింది. ఇరాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ రసాయన ఆయుధాల ప్రయోగాన్ని తాము ఖండిస్తామని, అమెరికా దాడులు అంతర్జాతీయ న్యాయసూత్రాలకు భంగం కల్గించేట్లుగా, ప్రమాదకరంగా ఉన్నాయని పేర్కొంది. అమెరికా ఒంటెత్తుపోకడలకు సాకులు వెతకడం లాగా ఉందని విమర్శించింది.

కాని అమెరికా యురోపియన్ మిత్రులు మాత్రం అమెరికా దాడులను సమర్థించాయి. ఈ దాడులు తీవ్రవాదాన్ని అరికట్టడంలో ట్రంప్‌కున్న నిబద్ధతను తెలియచేస్తున్నాయని ఈ దేశాలు వ్యాఖ్యానించాయి. ఆశ్చర్యకరంగా టర్కీ ఈ దాడులను సమర్థించింది. అల్ షమరల్

వాయు స్థావరం విధ్వంసం, పౌరులకు వ్యతిరేకంగా రసాయన ఆయుధాల ప్రయోగాలు మరోసారి జరగకుండా సహాయపడుతుందని టర్కీ వ్యాఖ్యానించింది. అస్సర్న్ పదవీచ్యుతుడిని చెయ్యాలన్న డిమాండ్‌ను టర్కీ ఉపసంహరించుకున్నాక రష్యా, టర్కీ, ఇరాన్‌లు అమెరికా జోక్యంలేకుండా శాంతి చర్చలు జరుపుతున్నాయి.

సిరియాపై అమెరికా మిసైల్ దాడి తర్వాత రష్యా ప్రవక్త మాట్లాడుతూ అమెరికా–రష్యా తీవ్రవాద వ్యతిరేక ఫ్రంట్ పట్టుకముందే అంతరించిందని పేర్కొన్నారు. రష్యా బలగాలు తీవ్రవాదులపై దాడులు చేస్తుండగా అమెరికా మిలిటరీ తీవ్రవాదులపై పోరాటం చేస్తున్న సిరియా ప్రభుత్వ దళాలపై దాడులు చేస్తున్నదని రష్యా ప్రవక్త అన్నారు. అమెరికా చర్యలు సాయుధ తీవ్రవాద గ్రూపులకు సహాయమందించేట్లుగా ఉందని ఇది తీవ్రవాదులను అడ్డుకుంటున్న సిరియా–అరబ్ సైన్యాలను బలహీనపరిచేట్లుగా ఉందని అన్నారు. ఇప్పుడు సిరియా శాంతి ప్రక్రియ ఒక పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని రోజుల తర్వాత 13–4–2017న అమెరికా మిలటరీకి చెందిన అత్యంత శక్తివంతమైన నాన్–న్యూక్లియర్ బాంబు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐఎస్ఐ స్థావరాలపై వేయబడింది. అమెరికా మిత్రదేశాలన్నీ, ముఖ్యంగా ఇస్రాయిల్ ఈ చర్యలను ప్రశంసించాయి. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా దళాలు వైదొలగుతున్నట్లుగా ఒబామా ప్రకటించిన మూడు సంవత్సరాల తర్వాత ఈ బాంబు దాడి జరిగింది. అమెరికా అనుకూల ఆఫ్ఘన్ ప్రభుత్వం ఈ దాడిని సమర్థించింది. హమిద్ కర్‌జాయి మాత్రం ఈ దాడి అమెరికా దీర్ఘకాలిక జోక్యానికి ప్రవేశికలాంటిదని విమర్శించారు. గత పదహారు సంవత్సరాలుగా అమెరికా మిలటరీ ఆఫ్ఘనిస్తాన్‌లో జోక్యం చేసుకుంటూనే ఉంది. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా పాలకులు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రాబల్యాన్ని బలోపేతం చేసుకోవడానికి చేపట్టబోతున్న సైనిక దుందుడుకు చర్యలకు సూచికలుగా వీటిని అర్థం చేసుకోవాలి.

## పశ్చిమాసియా

ఇస్రాయిల్ పాలస్తీనావ్యతిరేక విధానాలను దుందుడుకుగా కొనసాగిస్తున్నది. పాలస్తీనా ప్రాంతాలలో క్రొత్త జనావాసాలను నిర్మించాలని ఇస్రాయిల్ ఆదేశించింది. డొనాల్డ్ ట్రంప్ విజయాలు ఇస్రాయిల్ ప్రభుత్వాన్ని ఉత్తేజపరిచింది. ఇది అమెరికా–ఇస్రాయిల్‌ల సంబంధాన్ని మరింత బలోపేతం చేసింది. ఐఎస్‌తో పోరాటం నెపంతో ఇస్రాయిల్ సిరియన్ ప్రాంతాలలో వైమానిక దాడులను పెంచింది. పశ్చిమాసియా యొక్క ఐక్యరాజ్య సమితి ఆర్థిక సాంఘిక కమిషన్ ఇటీవల విడుదల చేసిన రిపోర్టులో పాలస్తీనా పట్ల ఇస్రాయిల్ జాతి వివక్ష విధానాలను అవలంబిస్తుందని తెలియజేసింది. తన బలమైన మిత్రపక్షం అమెరికా సహకారంతో ఇస్రాయిల్ ఐక్యరాజ్యసమితి ఈ రిపోర్టును ఉపసంహరించేట్లు చేసింది. రిపోర్టుకు కారకుడైన ఐక్యరాజ్యసమితి

అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ రాజీనామా చెయ్యాల్సి వచ్చింది. ఐక్యరాజ్యసమితికి తానిచ్చే ఆర్థిక మద్దతును ఆపివేస్తానని ఇస్రాయిల్ బెదిరించింది. ఇది అంతర్జాతీయ సంస్థలకుగాని ఐక్యరాజ్యసమితి తీర్మానాలకుగాని ఇస్రాయిల్ ఇచ్చే గౌరవం ఎంతో మరోసారి రుజువుచేసింది.

రష్యా చొరవతో పశ్చిమాసియాలో చేపట్టిన శాంతి చర్యలను అమెరికా దాని మిత్ర పక్షాలైన ఇస్రాయిల్ సౌదీ అరేబియాలు అడ్డుకుంటున్నాయి. సిరియా సైనిక బలగాలు ఇరాక్ ప్రభుత్వ బలగాలు ఐఎస్‌ను అదుపు చేయడంతో కొంత ప్రగతిని సాధించాయి. ఐఎస్ ఆక్రమణలో ఉన్న నగరాలను సిరియా సైనిక బలగాలు తిరిగి చేజిక్కుంచుకున్నాయి. అమెరికా తన మిత్ర పక్షమైన సౌదీ అరేబియాతో కలసి యెమెన్‌పై చేసిన వైమానిక దాడులలో వందలాది మంది యెమెన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

శాంతి పునరుద్ధరణకు సామాన్య ప్రజల ప్రాణ రక్షణకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్విగ్నంగాను, క్లిష్టంగానూ ఉన్నాయి.

## లాటిన్ అమెరికా

గత కేంద్ర కమిటీ సమావేశాలలో పేర్కొన్నట్లుగా లాటిన్ అమెరికాలో మితవాద శక్తులు వామపక్ష శక్తుల మధ్య జరుగుతున్న పోరాటం మరింత తీవ్రతరమవుతున్నది. వెనిజులాలో మితవాద, వామపక్ష శక్తుల మధ్యనున్న సంఘర్షణ మరింత తీవ్రంగా కొనసాగుతున్నది. మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైనిక కుట్రలు పన్నారన్న అభియోగంతో కొంతమంది సైనికాధికారులను ఇటీవల అరెస్ట్ చేసారు. అమెరికా విధించిన ఆంక్షల కారణంగా, మితవాదులు కులీనుల ఆధిపత్యంలో ప్రకటించిన ఆర్థిక దాడి కారణంగా ఆహార కొరత, నిత్యావసర వస్తువుల కొరత తీవ్రంగా ఉన్నది. కనీస వేతనాలను 50%, ఆహార కూపన్లను 75% పెంచి పదవీ విరమణ చెందిన వారిలో 90% మందికి వయోవృద్ధుల పెన్షన్ స్కీములను విస్తృతపరచడానికి ప్రెసిడెంట్ మదురో ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొరతలు కొనసాగుతున్నాయి. అమెరికాలో ట్రంప్ ఎన్నిక తర్వాత, మదురో ప్రభుత్వంపై ప్రతిపక్షాల దాడి పెరిగింది. నేషనల్ అసెంబ్లీలో వారికున్న బలాన్ని ఉపయోగించుకొని మదురో చేపట్టిన ప్రతి ప్రజానుకూల విధానాలను అడ్డుకుంటున్నారు. ఈ పరిస్థితులలో కోర్టు ధిక్కారణ నేరం క్రింద నేషనల్ అసెంబ్లీని దోషిని చేసిదాని విధులను తాను స్వాధీనం చేసుకుంటున్నట్లుగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే నేషనల్ డిఫెన్స్ కౌన్సిల్ జోక్యం చేసుకొని కోర్టు తాను ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకునేట్లుగా చేసింది. మితవాద శక్తులు తమ నిరసనలను తీవ్రతరం చేసారు. నేషనల్ అసెంబ్లీ ముఖ్యుడు(హెడ్) సైనిక తిరుగుబాటు చేయాల్సిందిగా సాయుధ దళాలకు పిలుపునిచ్చాడు. మదురో అనుకూల, ప్రతికూల శక్తులు వీధుల్లోకి వచ్చి పోరాడాల్సిందిగా తమ మద్దతుదారులకు పిలుపునిచ్చాడు.

రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్రం కానున్నది ఈక్విడార్‌లో చాలా తీవ్రంగా జరిగిన అధ్యక్ష ఎన్నికల యుద్ధంలో పాలక అలియాజ్ DcPIAS కి చెందిన లెనిన్ మోరెనా మితవాద అభ్యర్థిపై స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ విజయం లాటిన్ అమెరికాలో, ముఖ్యంగా అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత ట్రంప్ సహాయాన్ని ప్రోత్సాహాన్ని పొందుతున్న మితవాద శక్తులతో తీవ్రంగా పోరాడుతున్న వామపక్ష శక్తులకు అవసరమయిన బలాన్ని ఉత్తేజాన్ని అందించింది.

రిటైర్‌మెంట్ వయస్సులో పెంపుదలకు, ఉద్యోగ భద్రతకు విఘాతం కల్గించే ప్రభుత్వ చర్చలకు వ్యతిరేకంగా బ్రెజిల్‌లో నిరసనలు చెలరేగాయి. ఇదే సమయంలో ప్రస్తుత మితవాద ప్రభుత్వంలోని చాలామంది మంత్రులు అవినీతి ఆరోపణలకు గురై రాజీనామాలు చేయాల్సివచ్చింది. ఆరోపణలకు గురైన మంత్రులపై విచారణ కొనసాగుతున్నది. సోషలిస్టు అధ్యక్షురాలైన దిల్మారొసెఫ్‌పై చేపట్టిన అభిశంసన తీర్మానానికి నాయకత్వం వహించిన మాజీ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అవినీతి ఆరోపణలలో దోషిగా నిర్ధారింపబడి జైలు పాలయ్యాడు. బ్రెజిల్ మితవాద, వామపక్ష వాదుల మధ్యనున్న సంఘర్షణ తీవ్రంగా కొనసాగనున్నది.

## యునైటెడ్ కింగ్‌డమ్

గత కేంద్ర కమిటీలో మనం అంచనా వేసినట్లుగా ప్రధానమంత్రి థెరిసా మే ఆర్టికల్ 50పై లాంఛనంగా సంతకాలు చేసారు. దీంతో లిస్బన్ రాజ్యాంగ ఒప్పందం ద్వారా యురోపియన్ యూనియన్ నుంచి యు.కె. నిష్క్రమణకు లాంఛనప్రాయ చర్యలు ప్రాంభింపబడ్డయని చెప్పవచ్చు. యుకె నిష్క్రమణకు పాటుబడ్డ కన్సర్వేటివ్ పార్టీలోని సెక్షన్, అమెరికా, టర్కీ, జపాన్, ఇయు ఆవల దేశాలతో వ్యాపార లావాదేవీలకు ప్రయత్నాలు చేస్తున్నది. బ్రిటన్‌లో ఉన్న కొన్ని ఉపాధి గ్యారంటీలను కూడా రద్దు చేయడానికి వారు ప్రచారాలు చేస్తున్నారు.

జపాన్ బహుళజాతి సంస్థలు, ఇన్స్యురెన్స్ దిగ్గజాలైన లాయడ్ లాంటి సంస్థలు తమ కార్యకలాపాలను బ్రిటన్ నుంచి బదిలీ చేస్తామని బెదిరిస్తున్నాయి. ఇది బ్రిటన్ల పెట్టుబడులను ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తాయి. బ్రిటన్‌తో ఈయు చేపట్టే చర్చలు ఎలా ఉండాలన్న ముసాయిదా మార్గదర్శకాలలో వ్యాపార ప్రయోజనాలను కాపాడాలన్న అంశాన్ని ఇప్పటికే పొందుపరిచారు. యుకె, ఇయు సభ్యత్వ దేశాల మధ్య ద్వైపాక్షిక చర్యలను ఇయు డ్రాఫ్ట్ నిషేధించింది.

నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడానికి లేబర్‌పార్టీ వామపక్షాలు కసరత్తులు చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ పన్నులు ఉపాధి ట్రేడ్ యూనియన్ హక్కులు, జాతివివక్షతకు తావులేని వలస విధానం, శరణార్థుల వ్యవస్థ, ప్రభుత్వ యాజమాన్యం ఉండేట్లుగా ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనకు లేబర్ పార్టీ, వామపక్షాలు

ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విధానాలు ఎలా రూపొందించబడతాయో మనం వేచి చూడాల్సుంటుంది. ఇదే సమయంలో 2018 చివరలో కాని లేదా 2019 మొదట్లో కాని యుకె నుంచి వేరుపడాలన్న విషయంపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని స్కాట్‌లాండ్ పిలుపునిచ్చింది.

## యూరోప్

నెదర్లాండ్స్‌లో జరిగిన ఎన్నికలు యూరోప్‌లో మితవాద రాజకీయాల పట్ల ఉన్న మొగ్గుపై నిరసనను తెలియచేసాయి. పాలక లిబరల్ పార్టీ విజయం సాధించింది. జాతీయ ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్న పార్టీలతో కలిసి మితవాద డచ్‌ఫ్రీడం పార్టీకి వ్యతిరేకంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పర్చడానికి లిబరల్ పార్టీ ప్రణాళికలు వేస్తున్నది. ఈ ఎన్నికలలో వలసలకు అనుకూలంగా ప్రచారాన్ని నిర్వహించిన గ్రీన్ లెఫ్ట్ పార్టీ చక్కని ఫలితాలను సాధించింది.

యూరోప్‌లోని ఇతర ప్రాంతాలలో మితవాదశక్తులు చురుకుగా ఉన్నాయి. చాలా దేశాలలో ఈ శక్తులు వలసలు, ముస్లింలకు (ఇస్లామోఫోబియా) వ్యతిరేకంగా, ఇయు నుంచి నిష్క్రమించాలని ప్రచారాలు చేస్తున్నాయి. నయా ఉదారవాద విధానాల వల్ల, ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల పెరిగిన అసమానతకు బలవుతున్న కార్మికవర్గాన్ని, నిరుద్యోగులను ఆకర్షించడానికి ఈ శక్తులు ప్రయత్నం చేస్తున్నాయి. రక్షిత (Protectionist) ఆర్థిక విధానాలు అవలంబించాలని ఈ శక్తులు డిమాండ్ చేస్తున్నాయి.

## చైనా

మన గత సమావేశంలో గమనించినట్లుగా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రభుత్వం చైనా కమ్యూనిస్ట్ పార్టీ పెట్టుకున్న లక్ష్యానికి అనుగుణంగా చైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధించింది. ఆర్థికాభివృద్ధి లక్ష్యం 6.7% ఉండగా, చైనా ఆర్థిక వ్యవస్థ ఈ సంవత్సరం 6.7% వృద్ధిని సాధించింది. గత సంవత్సరం ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో చైనా వాటా 30%. 2016లో 13,14 మిలియన్ల క్రొత్త ఉద్యోగాలను పట్టణ ప్రాంతాలలో సృష్టించబడ్డాయి. కాలేజీ గ్రాడ్యుయేట్లలలో ఎక్కువమంది ఉద్యోగాలను సంపాదించుకోగల్గుతున్నారు. ఉద్యోగాల కల్పనలో వృద్ధి ఇటీవలి దశాబ్దాల కాలంలో కన్న చాలా ఎక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగపు రేటు 2016లో 4.2% మాత్రమే. ఇది గత కొన్ని సంవత్సరాలలో కన్నా అతి స్వల్పంగా ఉన్నది.

వ్యక్తిగత తలసరి వినియోగ ఆదాయము 6.3% పెరిగింది. ప్రస్తుత సం॥లో 12.4 మిలియన్లు ప్రజలు దారిద్ర్యరేఖపైకి తీసుకురాబడ్డారు. నివసించడానికి అనుకూలంగా లేని ప్రాంతాలలో నివసిస్తున్న 2.4 మిలియన్ల ప్రజలకు పునరావాసం కల్పించారు. అంతర్గత డిమాండ్‌ను పెంచడమే ప్రధాన ఆర్థిక లక్ష్యంగా సిపిసి ముందుకు సాగుతున్నది. ఇదే పట్టణ ప్రాంతాలలో ఉన్న నిరుద్యోగాన్ని పేదరికాన్ని తగ్గించగల్గుతుందని సిపిసి భావిస్తున్నది.

## దక్షిణ కొరియా

అవినీతి ఆరోపణలపై దక్షిణకొరియా అధ్యక్షుడిని అభిశంసించి జైలు శిక్ష వేసారు. అధ్యక్షునికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రాజకీయ అనిశ్చితి ఎలా ఉన్నప్పటికీ, అమెరికా థాడ్‌మిసైల్ వ్యవస్థను ఏర్పరిచే ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. ఇది కొరియా ద్వీపకల్పంలో సైనికీకరణను పెంచుతుంది. డిపిఆర్‌కె(ఉత్తరకొరియా) మరియు పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా దేశాల భద్రతకు కూడా ప్రమాదం కల్గిస్తుంది.

## సౌత్ ఆఫ్రికా

1994లో జాతి వివక్షతతో కూడిన ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత జరిగిన మొట్టమొదటి ఎన్నికల తర్వాత ANC-SACP-COSATU కూడిన మూడు పార్టీల కూటమి ప్రభుత్వం 52% వోటు శాతంతో అత్యంత తక్కువ ప్రజాదరణ రేటును పొందింది. మూడు పార్టీల మధ్యనున్న భేదాభిప్రాయాలు మరింత పెరిగాయి. ప్రభుత్వం అవినీతి కుంభకోణాలలో కూరుకొనిపోయింది. భారతీయ మూలాలు ఉన్న వ్యాపారవేత్తలతో అధ్యక్షునికి ఉన్న సన్నిహిత సంబంధం ఆయనను వివాదాల్లోకి నెట్టింది. భారతీయ వ్యాపారవేత్త గుప్తాను రక్షించడానికి ఆర్థికమంత్రిని అధ్యక్షుడు తొలగించాడు. ఇది భాగస్వామి పార్టీల మధ్యనున్న విభేదాలను మరింత పెంచింది. ప్రెసిడెంట్ జూమాకి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయి. అధ్యక్షుని చర్యలు దేశాన్ని సంక్షోభంలోకి, నెట్టినందున అధ్యక్షుడు రాజీనామా చెయ్యాలని SACP బహిరంగంగా డిమాండ్ చేసింది.

మనం ఇదివరకు గమనించినట్లుగా, ANC వరుస ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాల మార్గం విడవకుండా ఉండటం వల్లనే దేశంలో ఆశ్రిత పెట్టుబడిదారీతత్వం చాలా హెచ్చు స్థాయికి పెరిగింది. ఇది ఒక క్రొత్త బుర్జువా వర్గాన్ని సృష్టించింది. మరోవైపు నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయి. ANC కి వ్యతిరేకంగా పెరిగిన అసంతృప్తిని మితవాద శక్తులు ఉపయోగించుకుంటున్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో మితవాద శక్తులు తమ స్థాయిని పెంచుకున్నాయి. ఎఎన్‌సి 2017 చివరి త్రైమాసికంలో తమ మహాసభలను నిర్వహించుకోనున్నది. ఈ మహాసభలో ఎన్నికయిన నూతన అధ్యక్షుడు మూడుపార్టీల కూటమి అభ్యర్థిగా వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికలలో పోటీ చేస్తాడు.

### పొరుగుదేశాలు

పాకిస్తాన్‌తో సంబంధాలు మరింత దిగజారాయి. సెప్టెంబర్ 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్ తర్వాత తీవ్రవాద దాడులలో తరుగుదల ఏమీలేదు. అన్ని స్థాయిలలో చర్చల రద్దు తరువాత, సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి అవకాశాలు లేకుండాపోయాయి. భారతీయ

పౌరుడైన కులభూషన్ జాదవ్‌కి మరణశిక్ష విధించాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం సంబంధాలను మరింత దిగజార్చింది.

బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్‌హసినా ఇటీవల మనదేశంలో అధికార హోదాలో పర్యటించారు. చాలా కాలం తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత భారత్‌లో పర్యటించారు. పర్యటన విజయవంతమయిందని రెండు దేశాలు అధికారికంగా ప్రకటించినా, తీస్తానదిలోని నీళ్ళను పంచుకోవడం విషయంలో ఉన్న ప్రతిష్టంబన కొనసాగుతూనే ఉంది. రెండుదేశాలు ఈ విషయంలో అంగీకారానికి వచ్చిన ముసాయిదా పత్రంపై తన వ్యతిరేకతను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బహిరంగంగానే తెలిపారు. వచ్చే సంవత్సరం బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. నదీ జలాల పంపకాలపై ఒప్పందం కుదరకపోయినట్లేతే అది భారత వ్యతిరేక ప్రచారానికి దారితీసి రెండు దేశాల మధ్యనున్న స్నేహపూరిత సంబంధాలపై ప్రభావం చూపనున్నది.

నేపాల్ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయి. భవిష్యత్ రిపబ్లికన్ రాజ్యాంగంపై ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే నేపాల్ అధ్యక్షులు భారత్‌లో అధికారిక పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటనలో ఏమైనా క్రొత్త సమాచారము కాని పురోగతి కాని ఉంటుందా అనే దానికై మనం వేచి ఉండాల్సిందే.

నేపాల్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు రాజ్యాంగ ముసాయిదా ప్రతిపై ఎలాంటి అంగీకారానికి రాలేకపోయాయి. ఎన్నికల తేదీలపై కూడా వారు ఒక నిర్ణయానికి రాలేకపోయారు.రాజ్యాంగాన్ని ఆమోదించుకున్నాక ఎన్నికలు జరపాలా లేదా ఎన్నికలు నిర్వహించుకున్నాక రాజ్యాంగాన్ని ఆమోదించుకోవాలా అన్న విషయంపై రాజకీయ పార్టీలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాయి.రాజ్యాంగ పరిషత్ కాల పరిమితి త్వరలో ముగియనున్నది. ఈ కాల పరిమితి కన్నా ముందుగా రాజ్యాంగాన్ని ఆమోదించుకోలేకపోయినట్లయితే చాలా సంక్లిష్టమయిన రాజ్యాంగ సంక్షోభం ఏర్పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితులు అలాంటి సంక్షోభానికి దారితీసేట్టుగానే ఉన్నాయి. అన్ని రాజకీయ పక్షాలు ఏకాభిప్రాయానికి వస్తే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు.

# జాతీయం

## శాసనసభ ఎన్నికలు

ఉత్తర్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో బిజెపి నాలుగింట మూడు వంతులు స్థానాలు గెలిచి అఖండ విజయం సాధించింది. పచ్చి మతతత్వ ప్రచారం విస్తారమైన కుల సంకీర్ణాన్ని నిర్మించే సామాజిక సూత్రీకరణలతో ఈ విజయం సాధించారు. బిజెపి దానికి పంజాబ్‌లో పరాజయం ఎదురయింది. అక్కడ అకాలి–బిజెపి సంకీర్ణం పెద్ద ఓటమిని మూట కట్టుకున్నది. కాంగ్రెస్ నిర్దిష్టమైన మెజారిటి సాధించుకుంది.

గోవా, మణిపూర్‌లలో బిజెపికి మెజారిటీ రాకపోయినా, ఇతర పార్టీల నుండి గెలిచిన అభ్యర్థులను భారీగా ధనబలంతో మభ్యపెట్టి ఈ రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## శాసనసభ ఉప ఎన్నికలు

పది నియోజకవర్గాల్లో జరిగిన శాసనసభ ఉప ఎన్నికల్లో బిజెపి తన సిట్టింగ్ స్థానాలన్నింటినీ దక్కించుకుని పలుకుబడిని నిలబెట్టుకున్నది. బెంగాల్లో తృణముల్ కాంగ్రెస్, ఝార్ఖండ్‌లో జేఎంఎం వాటి స్థానాలను నిలబెట్టుకున్నాయి.

ఈ ఉప ఎన్నికల్లో అందరికంటే ఎక్కువ దెబ్బతిన్నది ఢీల్లీలో ఆప్ పార్టీ. అది తన సిట్టింగ్ స్థానంలో డిపాజిట్ కూడా కోల్పోయింది. ఆప్ శాసనసభ్యుడిని పంజాబ్‌లో ప్రకాష్ సింగ్ బాదల్‌పై పోటీగా పెట్టారు. అక్కడ కూడా ఆప్ ఓటమి పాలైంది. ఈ ఎన్నికల్లో ఆప్ ఓటింగ్ 52 నుండి 13 శాతానికి పడిపోయింది.

## శాసనసభ ఎన్నికల్లో సిపిఐ(ఎం) ఫలితాలు

### శాసనసభ ఎన్నికల్లో సిపిఐ(ఎం) పొందిన మొత్తం ఓట్లు

| రాష్ట్రం | 2007 | | 2012 | | 2017 | |
|---|---|---|---|---|---|---|
| | పోటీ చేసిన సీట్లు | ఓట్లు | పోటీ చేసిన సీట్లు | ఓట్లు | పోటీ చేసిన సీట్లు | ఓట్లు |
| ఉత్తర ప్రదేశ్ | 14 | 1,59,028 | 17 | 69,040 | 26 | 35,207 |
| పంజాబ్ | 12 | 35,147 | 9 | 21,719 | 12 | 10,901 |
| ఉత్తరాఖండ్ | | | 6 | 11,602 | 6 | 3,870 |

* సమాజ్‌వాది పార్టీ(ఎస్‌పి)తో పాక్షిక సర్దుబాటు చేసుకున్నాము.

మణిపూర్ మనం రెండు స్థానాల్లో పోటీ చేశాము, కానీ ఈసారి గోవాలో పోటీ చేయలేదు.

**ఉత్తర్ ప్రదేశ్‌లో** వామపక్ష సంఘటనలో భాగంగా మనపార్టీ 26 స్థానాల్లో పోటీ చేసి 35,207 ఓట్లు పొందింది. మొత్తం వచ్చిన ఓట్లలో అన్ని వామపక్షాలు కలిసినా 1 శాతం కూడా రాలేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో ఇది పార్టీకి అతి నిరుత్సాహకరమైన ఫలితం. 2012లో ఇంతకంటే తక్కువ స్థానాల్లో (17) పోటీ చేసి మనం 2017లో కంటే సుమారు రెట్టింపు ఓట్లు పొందాము.

మన పార్టీకి బలంగా ఉన్న మూడు రాష్ట్రాల తరువాత ఆంధ్ర, తమిళనాడుతో సమానంగా ముందు పీఠాన ఉన్న రాష్ట్రంగా **పంజాబ్** పరిగణించబడేది. గదర్ ఉద్యమం మొదలు స్వాతంత్ర్య పోరాటం దాకా ఉన్న సుదీర్ఘ చారిత్రక వారసత్వం పంజాబ్ ప్రజల సామాజిక చైతన్యం, మన పార్టీకి ప్రజల్లో ఉన్న బలమైన ప్రభావానికి కారణంగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ వామపక్షాలతో సర్దుబాటులో భాగంగా 12 స్థానాల్లో పోటీ చేసింది. నాలుగు వామపక్షాల్లో, సిపిఐ(ఎంఎల్) వేరే పార్టీలతో వ్యతిరేకించి ఎక్కువ ప్రభావం ఉన్న స్థానాల్లో కూడా పోటీ చేస్తామని ఒత్తిడి చేసి కూటమి నుండి నిష్క్రమించింది.

వామపక్షాలకు మొత్తం ఓట్లలో 0.6 శాతం వచ్చాయి. మనకంటే (0.07) సిపిఐ (0.22) మరియు మంగత్‌రాం పాస్లా పార్టీ(0.24), ఈ రెండు పార్టీలకు ఎక్కువ ఓట్లు వచ్చాయి. సిపిఐ(ఎంఎల్)కి 0.06 ఓట్లు వచ్చాయి.

**ఉత్తరాఖండ్‌లో** మనం 6 స్థానాలకు పోటీ చేసి 3,817 ఓట్లు పొందాము. 2012లో కూడా మనం 6 స్థానాలకు పోటీ చేసి 11,602 ఓట్లు పొందాము.

**మణిపూర్‌లో** కఠినమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ఫలితాలు చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. మనం పోటి చేసిన రెండు స్థానాల్లో ఒక స్థానంలో మొత్తం వచ్చిన 2,905 ఓట్లలో 129, రెండో స్థానంలో మొత్తం వేయబడిన ఓట్లలో 85 ఓట్లు మాత్రమే పొందాము.

పార్టీ స్వతంత్ర పునాది, రాజకీయంగా కలుగజేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవటానికి దగ్గర దార్లు లేవని నిర్మాణ ప్లీనంలో వక్కాణించటాన్ని ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవాలి. పార్టీ, ప్రజా సంఘాలను, ప్రజల్లో వాటి కార్యాచరణని బలోపేతం చేయటం–ప్రజా పంథా(మాస్ లైన్)– ద్వారానే మనం ఈ కర్తవ్యం పూర్తిచేయగలము. ఎన్నికల్లో పార్టీ ఫలితాలు స్వతంత్ర పునాది, పలుకుబడిని అభివృద్ధి చేసి, బలోపేతం చేయటంలో పార్టీ సాధించిన విజయం నిర్ణాయకంగా ఉంటుందని కూడా పార్టీ చెప్పింది.

మన పార్టీ చేసిన కృషి, వచ్చిన ఫలితాలను విశ్లేషించినప్పుడు, ఎన్నికల్లో పాల్గొనటానికి కేంద్రం గతంలో ప్రత్యేకంగా రూపొందించబడిన ప్రమాణాలను తిరిగి అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఒక స్థానానికి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ ప్రాంతంలో జరిగిన ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, అభివృద్ధి, పార్టీ నాయకత్వంలో నడుస్తున్న ప్రజా సంఘాల ఉనికి, దాని ప్రభావం తదితర ముఖ్య అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. ఈ అంశాలు పరిగణలోకి తీసుకోకుండా కేవలం ఎన్నికల్లో పోటీ చేయటం ద్వారా ఆశించిన ఫలితాలు రావు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ కేంద్రంలోని నిర్మాణ విభాగం గత ఎన్నికల ప్రమాణాలను పునఃపరిశీలించాలి. దేశంలోని అన్ని రాష్ట్రాలలో పార్టీ దీన్ని అమలు జరపాలి.

పార్టీ నిర్మాణ ప్లీనం జరిగి 15 నెలలు దాటింది. చాలా రాష్ట్రాలలో రాష్ట్ర ప్లీనంలు జరిగి కర్తవ్యాలు నిర్ధారించుకున్నాము. వీటిని జాగ్రత్తగా పరిశీలించి అమలు జరపటంలో ఉన్న లోపాలను గుర్తించి ఏప్రిల్ 2018లో జరగాల్సిన 22వ పార్టీ మహాసభల సన్నాహాల ప్రారంభానికి ముందే వీటిని సరిదిద్దుకోవాలి.

## వామపక్షాల ఐక్యత

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వామపక్షాల ఐక్యతకు విఘాతం కలిగింది. తన అసంబద్ధ వైఖరి కారణంగా పంజాబ్‌లో సిపిఐ(ఎంఎల్) వామపక్ష సంఘటనను విడిచి వెళ్ళింది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, రెండు రాష్ట్రాల్లో చాలా స్థానాల్లో సిపిఐ(ఎంఎల్) వామపక్ష అభ్యర్థులపై పోటీ చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో సిపిఎం అభ్యర్థులపై పోటీ చేసిన వారికి మన అభ్యర్థుల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలనే ఒక కర్తవ్యం మనం తీసుకున్నాము కనక త్వరలోనే సిపిఐ(ఎంఎల్)తో చర్చలు జరిపే అవసరం ఉంది. ఫార్వర్డ్ బ్లాకు, ఆర్ఎస్‌పి రెండూ కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్‌లో ఉన్నాయి. అదే సమయంలో పశ్చిమ బెంగాల్లో అవి వామపక్ష సంఘటనలో భాగస్వాములుగా ఉన్నాయి. ఎస్‌యుసిఐ ఎన్నికల్లో మనకు వ్యతిరేకంగా పోటి చేస్తూనే ఉంది. ప్రజా పోరాటాల అంశాలపై వామపక్షాలతో సహకరిస్తామని అది చెప్పింది. మన అవగాహనకు వ్యతిరేకంగా ఉన్నట్టనిపించే వారి ఇటీవల జాతీయ కార్యనిర్వాహక సమావేశం ఆమోదించిన రాజకీయ తీర్మానం తరువాత సిపిఐతో చర్చలు అనివార్యమైనాయి. రాష్ట్ర కేబినెట్‌లో లేక ఎల్‌డిఎఫ్ కమిటి సమావేశంలో చర్చించకుండా కేరళలో సిపిఐ బహిరంగంగా సిపియం, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంతో అభిప్రాయ భేదాలను ప్రకటిస్తోంది.

వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత నిర్మించటం, వాటిని ఇంకా బలోపేతం చేయటం పార్టీ ముందు తక్షణ కర్తవ్యంగా నిలిచింది. రాష్ట్ర కమిటీల వారి నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా దీనికి రూపం ఇవ్వాలి.

## రాజకీయ నిధులకు తిరోగమన మార్పులు

మోదీ ప్రభుత్వం గొంతు చించుకుని అవినీతిని, ప్రత్యేకంగా ఎన్నికల ప్రక్రియలో తుడిచిపెడతామని ప్రజలను మభ్యపెట్టే ఒక పెద్ద మోసానికి పాల్పడింది.

ద్రవ్య బిల్లు 2017లో సవరణను చొప్పించి "గత మూడు ఆర్థిక సంవత్సరాల నికర లాభంలో 7.5 శాతం పరిమితి" అని "కంపెనీలు నిధులు ఇచ్చిన రాజకీయ పక్షాల పేర్లు వెల్లడించే అవసరం" అని నిబంధనలను తీసివేయటంతో ఇది స్పష్టమవుతుంది. ఇప్పుడు సవరించబడిన కంపెనీ చట్టం ఎన్నికల బాండ్స్ పథకం క్రింద కార్పొరేట్లు, రాజకీయ పక్షాలకు పరిమితి లేకుండా, తీసుకున్నవారి పేరు తెలియజేయ వలసిన అవసరం లేకుండా అవకాశం కల్పిస్తోంది.

ఉన్నత స్థానాల్లో అవినీతికి మూలంగా నిలిచే రాజకీయ పక్షాలకు కార్పొరేట్లు నిధులు ఇవ్వటం రద్దు చేయాలని సిపియం డిమాండు చేస్తూ వస్తోంది. మోదీ ప్రభుత్వం రాజకీయ పక్షాలకు కార్పొరేట్ల నిధులు అందే ప్రక్రియను విస్తరించటమే కాకుండా భారీ ఎత్తున ధనం తరలించటానికి కొత్త మార్గాలను తయారు చేసింది.

మన ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను బలపర్చాల్సిన అవశ్యకతను గుర్తించే అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా ఉద్యమాలు, వ్యక్తులు అందరూ కలిసి ఐక్యంగా రాజకీయ అవినీతిని కొత్త రూపాల్లో దిగజార్చే ఈ చర్యలను వ్యతిరేకించాలి.

## ఆర్ఎస్ఎస్–బిజెపీల తాజా దూకుడు

ఇటీవలి ఎన్నికలు, ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో విజయం తరువాత ఆర్ఎస్ఎస్–బిజెపిలు వివిధ పద్ధతుల్లో మతపరమైన ధ్రువీకరణను పదునుపర్చే ఉద్దేశంతో వారి కార్యకలాపాల మోతాదును పెంచాయి. నరేంద్రమోడీ ప్రధాని అయిన తరువాత రెండేళ్ళ కాలంలో ఆర్ఎస్ఎస్ దేశమంతటా తన ప్రభావాన్ని వేగవంతంగా విస్తరించుకున్నది. వారి విస్తరణ, ప్రస్తుత కార్యకలాపాలపై నివేదిక సిసి సమాచార పత్రంగా విడిగా ఇవ్వబడుతుంది.

ఆదిత్యనాథ్ యోగి ముఖ్యమంత్రి ఎన్నికయిన నాటినుండీ చట్ట విరుద్ధ కబేళాల మూసివేత పేరుతో ప్రభుత్వం రాష్ట్రమంతటా వివిధ ప్రాంతాల్లో కబేళాలు, మాంసం దుకాణాలను లక్ష్యంగా ఎంచుకున్నది. మైనారిటీ ప్రజలపై దాడులు అధికమైనాయి. అబద్ధపు అభియోగాలతో అమాయకులు హత్యకు గురయ్యారు. ప్రపంచంలోనే అత్యధిక మాంసం ఎగుమతి చేసే దేశాల్లో భారత్ ఒకటి. అందులోనూ భారతదేశ మాంసం ఎగమతుల్లో 50 శాతం ఉత్తరప్రదేశ్ చేస్తుంది. 25 లక్షల కన్నా ఎక్కువ మందికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఈ వ్యాపారంతో సంబంధం ఉండడంవల్ల వారి జీవనోపాధి ప్రమాదంలో పడింది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అమ్మాయిలపై జరిగే వేధింపులకు వ్యతిరేకంగా యాంటీ–రోమియో బృందాలను ఏర్పాటు చేసింది. అవి నైతికతను కాపాడే పోలీసుల్లా వ్యవహరించడంతో యువతను ఇబ్బంది పేట్టే ఆకతాయిల బృందాలుగా మారాయి. ఆదిత్యనాథ్ యోగికి హిందూత్వ ఉన్మాదిగానే కాక మతకలహాలను రెచ్చగొట్టే రికార్డు కూడా ఉంది. అలాగే ఆయనపై అనేక నేరాలకు సంబంధించిన కేసులు నమోదయి ఉన్నాయి.

ప్రధాని మోడీ "సబ్ కా సాత్ – సబ్ కా వికాస్" అనే నినాదంతో ఒకవైపు ప్రజలను మభ్యపెడుతుండగా, ఆర్ఎస్ఎస్ – బిజెపీలు అసలైన హిందుత్వ ఎజెండా ప్రస్తుతం యూపీలో వెలుగుచూస్తోంది.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో గోరక్షకుల పేరుతో పనిచేస్తున్న ఆకతాయిల చర్యలు అమాయక ముస్లింలు, దళితుల ప్రాణాలను బలితీసుకుంటూనే ఉన్నాయి. ఈ ప్రైవేటు సైన్యాలు మరియు ఆకతాయి మూకలు మైనారిటీలు, దళిత ప్రజలపై దాడులు చేసిన కారణంగా ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులలో అన్నిటికంటే తాజా సంఘటన రాజస్థాన్‌లో ఆల్వార్ దగ్గర బెహరూర్‌లో పహులూఖాన్ హత్య.

జెఎన్‌యు, హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం వంటి విద్యా సంస్థలు, ముఖ్యంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలపై భారీ ఎత్తున దాడులు ఇంకా తీవ్రమవుతూనే ఉన్నాయి. భారతదేశం లౌకిక, ప్రజాతంత్ర రిపబ్లిక్ అనే రాజ్యాంగ సూత్రాల ఆధారంగా జరిగే

పరిశోధనలను నీరుగార్చే స్పష్టమైన ఆలోచనతో మన విద్యా, సాంస్కృతిక, చారిత్రక సంస్థలపై దాడులు ముమ్మరం ఆయ్యాయి. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో బీజెపి పట్ల ఉన్న వ్యతిరేక భావాలను రూపుమాపడానికి, భారతదేశ లౌకిక ప్రజాతంత్ర సూత్రాలపై ఆధారపడిన శాస్త్రీయమైన మానవతావాద పరిశోధనలను నీరుగార్చడానికి జెఎన్‌యూలో విద్యార్థుల అడ్మిషన్ల కోతకు కూడా ప్రభుత్వం సిద్ధపడింది.

## అయోధ్యపై సుప్రీం తీర్పు

భారత ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్.ఖేహర్ అయెధ్య వివాదాన్ని కోర్టు బయట చర్చల ద్వారా పరిష్కరించుకోమని చేసిన సూచన నిరుపయోగమైనది, పసలేనిది. అయోధ్య విషయంలో అలహాబాద్ హైకోర్టు తీర్పుకి వ్యతిరేకంగా చేయబడిన అభ్యర్థనలను సుప్రీం కోర్టు వినాల్సి ఉంది. అలా చేయకుండా ప్రధాన న్యాయమూర్తి సంబంధిత పక్షాలను కోర్టు బయట పరిష్కారానికి వెళ్ళమన్నారు.

ఈ విషయంలో చర్చలు, సంప్రదింపుల యొక్క సుదీర్ఘ చరిత్రే ఉంది. 1992లో బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత పరిస్థితి మారింది. ఒక వర్గం ఏకపక్షంగా మసీదును కూల్చే చర్యలు తీసుకున్నందున ఇక చర్చలకు తావు లేకుండా పోయింది. ఇప్పుడు ఉన్నత న్యాయవ్యవస్థ నుండి చర్చించుకోమని సూచించటం చట్టాన్ని ఉల్లంఘించిన, రాజ్యాంగం కాలరాసిన విషయాన్ని విస్మరించటమే.

ప్రధాన న్యాయమూర్తి సంబంధిత పక్షాలు చర్చలు జరపగలవా లేదా అనేదాని గురించి సంప్రదించమని సుబ్రమణ్యస్వామిని కోరటం కూడా ఆక్షేపణీయం. మొదటిది సుబ్రమణ్యస్వామి ఈ వ్యాజ్యంలో ఫిర్యాదీ కాదు. అంతేకాక మసీదుని తొలగించి అక్కడ ఒక మందిరం నిర్మించటానికి మద్ధతిచ్చినవాడిగా ఆయనకు పేరు ఉంది.

కాకపోతే బిజెపి నాయకులు ఎల్‌కె అద్వానీ, మురళీమనోహర్ జోషి, ఉమాభారతిలపై బాబ్రీమసీదు కూల్చివేతకు కుట్ర చేసిన నేరాభియోగం తిరిగి మోపే సుప్రీం కోర్టు నిర్ణయం

హర్షించదగినది. ఈ తీర్పు దృష్ట్యా కళ్యాణసింగ్ గవర్నర్ పదవికి అలాగే ఉమాభారతి కేంద్ర కేబినెట్‌కి రాజీనామా చేయాలి.

## భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి :

జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి) పెరుగుదల రేటు అంచనాకు సంబంధించి ఎంత గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ దేశంలో ఆర్థిక వ్యవస్థ మూలాల ముఖ్య సూచికలు ప్రభుత్వం చెప్పేదాన్ని సమర్ధించడం లేదు.

జనవరి 2015 నుండి జనవరి 2017 వరకు రిజర్వ్ బ్యాంకు పరిశ్రమలకు ఇచ్చిన మొత్తం బ్యాంకు రుణాలు కేవలం 0.29 శాతమే పెరిగిందని గణాంకాలు చెపుతున్నాయి. వీటిలో సూక్ష్మ, చిన్న, మధ్యస్థ మరియు భారీ పరిశ్రమలు అన్నీ ఉన్నాయి. ఉత్పత్తి, రెండింటి ఉపాధి పెరుగుదల అతి సామాన్యంగానే ఉన్నాయనేది దీన్ని బట్టి స్పష్టమవుతున్నది.

జనవరి 2015 నుండి జనవరి 2017 మధ్య పారిశ్రామిక ఉత్పత్తి 189.2 నుండి 191.3కి అనగా కేవలం 2.1 శాతం మాత్రమే పెరిగిందని గణాంకాల సూచిక చెపుతుంది.

ఆర్థిక వ్యవస్థలో సమగ్ర, స్థిర పెట్టుబడి తయారీ (జీఎఫ్‌సీఎఫ్) పడిపోయినప్పుడు నిలకడగా 8 శాతం జీడీపీ పెరుగుదల ఎప్పటికీ సాధ్యం కాదు. జీడీపీలో శాతంగా దీన్ని పరిగణించినప్పుడు ఇది 2014-15లో 30 శాతం నుండి 2016-17లో 27 శాతానికి పడిపోయింది. పెరుగుదల రేటు ప్రకారం చూస్తే జీఎఫ్‌సీఎఫ్2015-16లో 6.11 శాతం నుండి 2016-17లో 0.57 శాతానికి పడిపోయింది. దీనిని బట్టి భారతదేశ ఉత్పత్తి పారిశ్రామిక అభివృద్ధి యొక్క భవిష్యత్తు సామర్థ్యం నిలకడైన పునాదిపై లేదు అని అర్థం అవుతున్నది.

ఇదంతా సాధారణ **ఉపాధి** పరిస్థితిపై ప్రభావం చూపుతోంది. ఈ విషయంలో కచ్చితమైన గణాంకాలు అందుబాటులో లేవు. 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం తర్వాత శ్రామికులు

ఎక్కువగా ఉండే 8 రకాల పరిశ్రమలలో సాలీన ఉపాధి సమీక్షలు ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు లేబర్ బ్యూరో ద్వారా 3 నివేదికలు విడుదల చేశారు. 2016 ఏప్రిల్ 1 నాటికి ఈ 8 రకాల పరిశ్రమలలో 2 కోట్ల మంది కార్మికులు ఉన్నారు. 2016 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మధ్య ఈ రంగాల్లో 1,09,000 ఉద్యోగాలే పెరిగాయి. ప్రధాని మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించే హామీతో దీనిని పోల్చితే లక్ష్యం కనుచూపుమేరలో లేదు.

విస్తారమైన గ్రామీణ ప్రాంతాల్లో **వ్యవసాయ సంక్షోభం** కష్టాలు కొనసాగుతున్నాయి. ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీస మద్ధతు ధర ఇస్తామనే బీజెపి ప్రభుత్వం తన వాగ్దానం నుండి వెనక్కు వెళ్ళిపోయింది. దీన్ని వదిలేసి కేవలం రుణమాఫీ చేయటం తాత్కాలిక ఊరటనే ఇస్తుంది తప్ప దీర్ఘకాలంలో వ్యవసాయ రంగాన్ని పట్టి పీడిస్తున్న సంక్షోభాన్ని పరిష్కరించలేదు.

దక్షిణ భారతంలో రుతు పవనాలు విఫలం కావడంతో తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం ఏర్పడింది. తమిళనాడులో వందలాది మంది రైతులు ఆర్థికబాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. విస్తారంగా ఉద్యమాలు జరిపి ఢిల్లీ పార్లమెంట్ వరకు వెళ్ళినా అటు కేంద్ర ప్రభుత్వంగానీ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంగానీ ఇప్పటివరకూ ఎటువంటి సహాయం అందించలేదు.

## అవధుల్లేని అసమానతల పెరుగుదల

బీజెపి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళ కాలంలో, భారతదేశ అత్యంత ధనికులు జనాభాలో ఒకశాతం ఉండగా వారి సంపద జాతీయ సంపదలో 49 శాతం నుండి 58.4 శాతానికి పెరిగింది. ఈ సంఖ్య 2000 సంవత్సరంలో 36.8 శాతంగా ఉంది. క్రెడిట్ సూఇస్ నివేదిక లో ఇచ్చిన ఇంకా ఘోరమైన విషయం ఏమంటే, జనాభాలో అట్టడుగున ఉన్న 70 శాతం దగ్గర జాతీయ సంపదలో 7శాతం మాత్రమే ఉన్నది. 2010లో ఈ సంఖ్య రెట్టింపు అంటే 14శాతం ఉంది.

కుటుంబ ఖర్చులపై తాజా నమూనా సమీక్ష నివేదిక ప్రకారం భారతదేశంలో ధనికులు, పేదల మధ్య భారీ అంతరం సెరవేగంగా పెరుగుతున్నది. భారత కుటుంబాల్లో పైనున్న 10 శాతం చేతుల్లో సగటు ఆస్తి రూ 1.5 కోట్లుగా ఉన్నది. ఇది భారత సమాజంలో కిందనున్న 10శాతం సగటు ఆస్తి కంటే 50,034 రెట్లుగా ఉన్నది. ఈ అంతరం కేవలం ధనికులు, పేదల మధ్యనే కాకుండా ధనికులకు, మధ్యతరగతికి మధ్య కూడా తీవ్రంగా పెరుగుతున్నది. పైనున్న 10 శాతం ఆ తర్వాత ఉన్న 10 శాతం కుటుంబాల్లో సగటు ఆస్తి 35 లక్షలుగా ఉన్నది. పైనున్న 10 శాతం చేతుల్లో సగటున కోటిన్నర ఉండటంతో, ఆ తర్వాతి 10 శాతం ఉన్నత మధ్యతరగతి సగటు ఆస్తి పోలిస్తే ఇది నాలుగు రెట్లుగా ఉన్నది. పైనున్న 10శాతం కాకుండా మిగిలిన 90 శాతం భారతీయ కుటుంబాల సగటు ఆస్తి 82 లక్షలుగా ఉన్నది. అంటే పైనున్న 10 శాతం కుటుంబాల సగటు ఆస్తి విలువ మిగతా 90 శాతం భారతీయుల సగటు ఆస్తి విలువల కంటే రెట్టింపుగా ఉన్నది. మనం భారతదేశం రెండు భారతాలుగా తయారవుతున్నదని చెపుతూ వచ్చాం ఇప్పుడు ఆది చీలిక మరింత వేగాన్ని పుంజుకున్నది.

వినియోగ అసమానతలకు సంబంధించిన జాతీయ నమూనా సంస్థ యొక్క గణాంకాల ద్వారా ఇలాంటి అసమానతలు గుర్తించగలము. పట్టణ భారతంలో అత్యధిక ధనికులైన 5 శాతం ప్రజల నెలవారీ తలసరి ఖర్చు అత్యధిక పేదలైన 5 శాతం ఖర్చు కంటే 15 రెట్లు ఉంది. ఇది భారతదేశంలో మధ్యతరగతి ఖర్చు కంటే 5 రెట్లు ఎక్కువ. భారత పేద ప్రజలు పేట్టే ఖర్చు ఎంత తక్కువగా ఉన్నదంటే దీనిని స్థూల జాతీయోత్పత్తి లేక పన్నుల సేకరణకు సంబంధించి జాతీయ స్థాయి గణాంకాలు సేకరించేటప్పుడు తీసుకోవడంలేదు. నిజానికి భారతదేశంలో కిందనున్న 50 శాతం జనాభా కేవలం బతికి ఉండడానికి తప్ప వేరే ఏ ఖర్చూ పెట్టటం లేదు. ఈ అసమానతల కారణంగా నోట్ల రద్దు వల్ల భారత పేద ప్రజల దెబ్బపైపడ్డ దెబ్బ లెక్కకి రాలేదు. ఎందుకంటే కేవలం ధనికులు, ఇంకా కొంతమేరకు మధ్యతరగతిలో పైభాగంలో ఉన్నవారే ఖర్చు పెట్టగల స్థితిలో ఉన్నారు. నోట్ల రద్దు తర్వాత స్థూల జాతీయోత్పత్తి, పన్నుల సేకరణ, ఇంకా చెప్పాలంటే సెన్సెక్స్ లెక్కలు ఎటువంటి తిరోగమన తీరు కనపరచకపోవటం దీన్ని బట్టి స్పష్టమవుతుంది. మరోలా చెప్పాలంటే నోట్ల

రద్దు ప్రజల జీవనోపాధిపై ఎటువంటి ప్రభావం చూపలేదు అని కాదు. ఇది భారతదేశ ప్రజల్లో సగ భాగాన్ని అతలాకుతలం చేసింది. కానీ అది గణాంక వివరాలలో ప్రతిబింబించలేదు.

## నోట్లు రద్దు

దేశ ఆర్థిక కార్యకలాపాలపై నోట్ల రద్దు ప్రభావం కొనసాగుతున్నది. రిజర్వుబాంకు తన తాజా గణాంకాల్లో రద్దయిన నోట్ల స్థానంలో కొత్త నోట్లు పూరించే ప్రక్రియ మందగించిందని సూచిస్తోంది. 4 నవంబరు 2016న వాడుకలో ఉన్న నోట్ల విలువ రు. 17.97 లక్షల కోట్లు కాగా 24 మార్చి 2017 నాడు అది కేవలం రు.13.13 లక్షల కోట్లుగా ఉంది. నోట్లు రద్దుకు ముందు ఏటిఎమ్‌లలో పెడుతున్న నగదు కంటే ఆ తర్వాత 30 శాతం తక్కువగా పెట్టడం కొనసాగుతోంది. నగదు తీసుకోవడం కూడా వేగంగా తగ్గుతూ వస్తున్నది. జనవరి 13,2017 చివరి వారంలో అత్యధికంగా రు. 52,800 కోట్లు డ్రా చేయడం జరగితే మార్చి 24,2017 చివరి వారంలో అది రు. 32,500 కోట్లు.

డిజిటల్ లావాదేవీలు పెద్ద ఎత్తున జరిగిన కారణంగానే నగదు తీయటంలో ఈ తగ్గుదల అని ప్రధాని మోదీ బిజెపి ప్రభుత్వం అని ఎంత చెప్పినా వాస్తవం దానికి భిన్నంగా ఉంది. ఫిబ్రవరిలో రు.684.66 మిలియన్ నుండి మార్చి 26, 2017 నాటికి డిజిటల్ లావాదేవీలు రు.497.2 మిలియన్‌కి పడిపోయాయి. నోట్లుసరిపడా లేకపోవడం ఆర్థిక లావాదేవీలను ప్రభావితం చేస్తున్నదనేది స్పష్టం. నోట్ల రద్దుకు ముందు ఉన్న స్థాయికి చేరుకోవాలంటే రు. 10 బిలియన్ల విలువ గల రు. 500 నోట్లు ముద్రించాల్సి ఉంటుందని బ్యాంకు అధికారులు చెపుతున్నారు. ఇందుకు మరో పదినెలల కాలం అవసరమవుతుంది. జిడిపిలో 40 శాతంగా ఉండి నాలుగింట మూడొంతులు ఉపాధి కల్పించే మన ఆర్థిక వ్యవస్థలోని అసంఘటిత రంగం దెబ్బతింటూనే ఉన్నది.

## నయా ఉదారవాద విధానాల దూకుడు

బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు దూకుడుగా కొనసాగిస్తున్నది. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటుపరం చేసే ప్రక్రియ కూడా వేగవంతం అయింది.

బిజెపి ప్రభుత్వం పార్లమెంటు రెండు సభల్లో జిఎస్‌టి బిల్లును ఆమోదింపచేసుకోవడంలో సఫలమైంది. జిఎస్‌టి బిల్లుపై ఒక సవరణ ప్రతిపాదించి దానిపై మనం ఓటు వేశాము. రాజ్యసభలో అతి పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్, జిఎస్‌టి ప్రధానంగా వారి ఆలోచనే అని చెపుతూ నయా ఉదారవాద విధానాలను బలపరిచే తన వైఖరికి అనుగుణంగా ఓటింగ్‌నుంచి వెనక్కి తగ్గింది. దీంతో బిజెపి "ఒక దేశం, ఒక పన్ను" సాధించామనే ప్రచారం ముమ్మరం చేసింది.

## జమ్మూ, కాశ్మీర్

జమ్మూ కాశ్మీర రాష్ట్రంలో జరిగిన తాజా ఎన్నికల్లో కాశ్మీరులో ప్రజలు ఎంత ఘోరంగా ప్రజాస్వామ్య ప్రక్రియకు దూరం చేయబడ్డారో స్పష్టంగా సూచిస్తున్నది. జమ్మూ, కాశ్మీరులో పరిపాలన విఫలమైందనే విషయం తెలుస్తోంది. కొనసాగుతున్న హింసతో పౌరులు చనిపోవటం, గాయాలపాలవటం తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నది. శ్రీనగర్ పార్లమెంటు ఉప ఎన్నికల్లో 7 శాతం ఓట్లు పడటం అలాగే కొన్ని కేంద్రాల్లో తిరిగి ఓటింగ్ రెండు శాతమే జరగడం బిజెపి కాశ్మీరు విధానం పూర్తిగా వైఫల్యం చెందిందని రుజువు చేస్తోంది.

కేంద్రహోం మంత్రి నాయకత్వంలో ఆ రాష్ట్రాన్ని సందర్శించిన పార్లమెంటరీ ప్రతినిధి బృందం చేసిన సూచనలను బిజెపి ప్రభుత్వం అమలుజరిపి ఉంటే ఒక కొత్త మార్గం దొరికేది. తక్షణం నమ్మకం కలిగించే చర్యలు అమలు జరపడం, సంబంధిత అన్ని వర్గాలతో చర్చించే రాజకీయ ప్రక్రియను ప్రారంభించడం జరిగి ఉండవలసినది, ఈ ప్రభుత్వం కాగితాలపై ఒప్పుకున్నా ఆచరణలో ఈ దిశగా ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు. దేశంలో

ఇతర ప్రాంతాల్లో మతపరమైన కేంద్రీకరణలు ఇంకా తీవ్రంచేసే గట్టి ప్రయత్నాల కోసం జమ్మూ కాశ్మీర్ పరిస్థితిని వాడుకోవాలని ఆర్ఎస్ఎస్, బిజెపి చూస్తున్నాయనేది స్పష్టం.

కాశ్మీరులో ప్రజలపై రాజ్యం అణచివేత పెరుగుతూనే ఉంది. దీనివల్ల వారు ఇంకా దూరమవుతున్నారు. రాళ్ళు రువ్వేవారిని అడ్డుకోడానికి డాలుగా ఉపయోగించుకున్నట్టు, ఒక కాశ్మీరీ యువకుడిని కేంద్ర భద్రతా బలగాలు జీపుకి ముందు కట్టివేసిన దృశ్యంపై ప్రజల్లో భారీ నిరసన చోటుచేసుకుంది.

## ఆర్ఎస్ఎస్, బిజెపి సిపిఐ(యం) మరియు వామపక్షాలపై ఎక్కుపెట్టడం

మన ఆఖరి కేంద్రకమిటి సమావేశంలో గుర్తించినట్టు ఆర్ఎస్ఎస్,బిజెపిలు సిపిఐ(యం)ని వామపక్షాలను బలహీనపర్చడానికి ఎక్కుపెట్టే తన ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. తాము ఇంకా ముందుకు పోవడానికి వామపక్షాలను వారు పెద్ద ప్రతిబంధకంగా చూస్తారు. **కేరళలో** ఆర్ఎస్ఎస్ హింసాత్మక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఆ రాష్ట్రంలో మొహరించిన కేంద్ర బలగాలను అక్రమంగా వాడుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నడుస్తున్న కొద్ది కాలంలోనే 6 గురు సిపియం కార్యకర్తలు హత్యచేయబడ్డారు. ఎంతోమంది సభ్యులు గాయపరచబడ్డారు. పార్టీ కార్యాలయాలు ఇళ్ళు ఆర్ఎస్ఎస్ హింసాత్మక దాడిలో ధ్వంసం చేయబడ్డాయి. ఆర్ఎస్ఎస్ కోయంబతూర్ తీర్మానంలో సిపియం, వామపక్షాలు దాడికి ఎంచుకోబడ్డాయి. మంగుళూరులో సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బహిరంగసభను భగ్నం చేయడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి అన్ని ప్రయత్నాలు చేశాయి. అక్కడి సిపియం కార్యకర్తలపైన, కార్యాలయాలపైనా దాడులు చేశారు. ఇంకా ఘోరమైన సంఘటన ఏమంటే, ఉజ్జయినిలో ఆర్ఎస్ఎస్ ముఖ్య ప్రచారకుడు బహిరంగంగా పినరయి విజయన్ తల నరికినవాడికి కోటి రూపాయలు బహుమానంగా ప్రకటించాడు. సిపియం ఎల్‌డిఎఫ్ ఈ దాడులను ఎదుర్కొంటూ బిజెపి రాజకీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిలువరిస్తున్నాయి.

వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగబోతున్న **త్రిపురలో** బిజెపి తన చర్యలను ముమ్మరం చేసింది. అది వాస్తవానికి తృణమూల్ కాంగ్రెస్ నిర్మాణాన్ని పూర్తిగా మింగేసింది. వామపక్ష వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక మితవాద శక్తులు అన్నీ తన చుట్టూ చేరేలా బిజెపి కాంగ్రెస్ పార్టీలకి బదులుగా నిలిచింది. ఒక సందర్భంలో గిరిజనులు, గిరిజనేతర ప్రజల మధ్య జాతిపరమైన కలహాలు సృష్టించే విఫలయత్నం చేసింది. పార్టీ, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం చురుకుగా చర్యలు తీసుకుని పరిస్థితి విషమించకుండా నివారించగలిగాయి.

త్రిపుర బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు విప్లవ్‌దేవ్ ఒక బహిరంగసభలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్వచ్ఛత, ఉపయోగితపైనే సందేహం వెలిబుచ్చారు. దమ్ముంటే తనపై అభియోగం మోపమని త్రిపుర ముఖ్యమంత్రికి అతను సవాలు కూడా చేశాడు. ఇంకా ముఖ్యమంత్రి సిపియంకి వేసే ఓటు కూడా కమలం గుర్తుకే చూపించబడుతుందని వక్కాణించాడు. మనం విషయాన్ని అధికారికంగా చీఫ్ ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువచ్చి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాము.

ఈ పరిణామాల దృష్ట్యా త్రిపుర రాష్ట్రంలో ఉపయోగించబడు అన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను 'ఓటర్ వెరిఫైడ్ పేపర ఆడిట ట్రెయిల్' (వివిపిఏటి)తో అనుసంధానించాలి. రాబోయే ఎన్నికలలో త్రిపుర ప్రజల్లో స్వతంత్ర, స్వచ్ఛమైన ఎన్నికల ప్రక్రియ గురించి నమ్మకం కుదర్చటానికి కనీస స్థాయిలో చేయగలిగేది ఇదే.

**పశ్చిమ బెంగాల్** లో ఇటీవలి శాసనసభ ఉప ఎన్నికల్లో బిజెపి రెండవ పార్టీగా ఆవిర్భవించింది. తృణమూల్ కాంగ్రెస్‌కు వేయబడిన ఓట్లలో 55 శాతం రాగా బిజెపికి 30 శాతం వచ్చాయి. వామపక్ష సంఘటన తరఫున పోటీ చేసిన సిపిఐ అభ్యర్థికి 10 శాతం వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష సంఘటన, సిపిఐ(యం) మళ్ళీ కూడుకుని రాజకీయ ప్రత్యామ్నాయంగా అవతరించకుండా చేయాలని ఆర్ఎస్‌పి, బిజెపి సునిశితంగా పని చేస్తున్నాయి.

పైకి ఎన్ని పోజులు పెట్టినా తృణమూల్ కాంగ్రెస్, బిజెపి ఒకరితో ఒకరు సహకరించుకుని పనిచేస్తున్నాయనేది స్పష్టం. ముస్లిం మతతత్వ వాదానికి తృణమూల్ కాంగ్రెస్ ఇస్తున్న ఊతం రాజకీయంగా బిజెపికి హిందూ మతతత్వాన్ని బలపర్చుకోటానికి అనుకూలిస్తోంది. ఇంకా నారద, శారద కుంభకోణాలపై జరుగుతున్న సిబిఐ విచారణ దృష్ట్యా ఈ కుంభకోణాలలో కేంద్ర బిందువులుగా ఉన్న కొంతమంది ముఖ్య వ్యక్తులకు రక్షణ కల్పించటానికి తృణమూల్ కాంగ్రెస్‌కు కేంద్ర బిజెపి ప్రభుత్వ కీలక మద్ధతు అవసరం. ఈ పరిస్థితిలో సిపియం, వామపక్షాలను పశ్చిమ బెంగాల్‌లో ఇంకా బలహీనపరిచి రాజకీయంగా, ఎన్నికలపరంగా దూరంగా మూడవ స్థానానికి నెట్టేసే ఉద్ధేశంతో టిఎమ్‌సి, బిజెపి రెండూ క్రియాశీలంగా పనిచేస్తున్నాయి.

వామపక్షాలకు వ్యతిరేకంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల ఈ మూకుమ్మడి దాడులు, సిపిఐ(యం) ప్రభావం లేకుండా చేసే ప్రయత్నాలను ప్రతిభావంతంగా తిప్పికొట్టాలి. ఎన్నికల ఫలితాలపై చేసిన క్లుప్తమైన సమీక్షలో పార్టీ 21వ మహాసభలో తీసుకున్న నిర్ణయాలను పునరుద్ఘాటించాము. ఇంకా ముఖ్యంగా నిర్మాణ ప్లీనం ప్రకారం ప్రజాఉద్యమాలు నిర్మించి పార్టీ స్వతంత్ర సామర్ధ్యాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత తక్షణ ప్రాధాన్యతగా గుర్తించాము.

## రాష్ట్రపతి/ఉపరాష్ట్రపతి ఎన్నికలు

రాబోయే భారత రాష్ట్రపతి ఎన్నికలను మనం ఉపయోగించుకోవాలి. ఒక ఉమ్మడి అభ్యర్ధిని వీలైతే అన్ని ప్రతిపక్షాలకు ఆమోదయోగ్యమైన ఏ రాజకీయ పక్షానికి చెందని ఒక అభ్యర్ధిని వెతుక్కోవాలి. ప్రస్తుతం భారత రాష్ట్రపతిని ఎన్నుకునే ఎన్నికల క్షేత్రంలో ఎన్‌డిఏ భాగస్వాములతో సహా బిజెపికి సుమారు 2 శాతం ఓట్లు తక్కువగా ఉన్నాయి. ఎన్‌డిఏలో లేని ఏ ప్రాంతీయ పార్టీతో బిజెపికి అవగాహన కుదిరినా దానికి రాష్ట్రపతి అభ్యర్ధిని గెలిపించుకోవడం సులభం అవుతుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రపతి పదవి చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. భారత లౌకిక, ప్రజాస్వామ్య తత్వాన్ని కేంద్ర బిజెపి హిందూరాష్ట్ర స్థాపన సైద్ధాంతిక లక్ష్యంతో మార్చి,

వారి ప్రకటిత లక్ష్యం దృష్ట్యా భారత రాజ్యాంగానికి సంరక్షకుడైన రాష్ట్రపతి పాత్రకు ఇంకా ఎక్కువ ప్రాముఖ్యత ఉన్నది. ఈ దిశగా మనం అన్ని రకాల ప్రయత్నాలు చేసి, అన్ని లౌకిక పక్షాలను ఐక్యం చేసి ఆర్ఎస్ఎస్‌కు చెందని వ్యక్తి భారతదేశానికి రాష్ట్రపతి అయ్యేలా కృషి చెయ్యాలి.

ఉపరాష్ట్రపతి ఎన్నికలు పార్లమెంటు ఉభయసభల వరకే పరిమితం. అక్కడ ఎన్‌డిఏ భాగస్వాములతో కలిసి బిజెపికి స్పష్టమైన అవకాశం ఉన్నది. అందువలన ఉపరాష్ట్రపతికి ఒక ఉమ్మడి అభ్యర్థిని వెతకగల అవకాశం అతి స్వల్పమే.

## వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడం

వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతను బలపర్చటానికి 21వ మహాసభలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా 5 అంశాలపై ప్రత్యేకమైన చొరవతో ముందుకు వెళ్ళాలని గత జనవరిలో తిరువనంతపురంలో జరిగిన మన ఆఖరి కేంద్రకమిటీ సమావేశంలో మనం నిర్ణయించాము.

ఈ ఐదు ఇలా ఉన్నాయి; (1) దళిత ఉద్యమాలతో సంబంధాలను బలపర్చుకోవటం(2) మతతత్వ వ్యతిరేక సదస్సులను జరపడానికి చొరవ తీసుకోవటం (3) మేధావులు/కళాకారులు/ పెరుగుతున్న అసహనం, ఉన్నత విద్య మరియు పరిశోధనపై దాడి, నైతిక పోలీసుగా వ్యవహరించటం గురించి ఆలోచించేవారితో సంబంధాలను పెంపొందించుకోవటం(4) ముస్లింలు, ఇతర మైనారిటీల ఉద్యమాలతో సంబంధాలు ఏర్పరుచుకోవటం మరియు (5)కొద్ది సంవత్సరాల క్రితం ఏర్పడిన ప్రజాసంఘాల వేదిక కంటే పెద్దది, విస్తృతమైనది అయిన ఒక ప్రజా ఉద్యమాల వేదికను ఏర్పరచటానికి ముందుకు సాగడం.

ఈ కాలంలో దళిత ఉద్యమాలతో సంబంధాలు బలపడ్డాయి. దళిత స్వాభిమాన్ ఫ్రంట్ వేదికపై హైద్రాబాద్‌లో ఒక ఉమ్మడి ర్యాలీ నిర్వహించబడింది. దళిత సబ్‌ప్లాన్ గాలికి వదిలేయటం మరియు ఇతర చట్టపరమైన విషయాలకు సంబంధించి ప్రజల మద్ధతు

కూడగట్టడానికి చొరవ తీసుకోవడం జరిగింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నం చేశాము.

ప్రజా పోరాటాల వేదిక నిర్మించటానికి ఇతర వామపక్ష పార్టీ ప్రజాసంఘాలు, కొన్ని ప్రజా, సామాజిక ఉద్యమాలను సమీకరించటానికి ముందుగా సిపియం, సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల సమావేశాలు ఇప్పటికి మూడుసార్లు జరిగాయి. ఈ ప్రక్రియ ప్రారంభించబడినది. మే నెలలో వామపక్షాల ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమాల విస్తృతమైన సంప్రదింపుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఒక జాతీయ సదస్సు నిర్వహించటానికి ప్రతిపాదనలను ఖరారు చేయటం జరుగుతుంది. ఆమోదించబడ్డ సాధారణ డిమాండ్ల జాబితాపై ప్రజాపోరాటాలకు పిలుపునివ్వడం జరుగుతుంది.

## ప్రజా ఉద్యమాలను పెంచడం

ఈ మధ్య కాలంలో పార్టీ, ప్రజా సంఘాలు ప్రజల సమస్యలపై క్రీయాశీలకంగా పని చేస్తున్నాయి. హిందూత్వ శక్తుల దాడులను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నాయి.

మన విద్యార్థి సంఘం విశ్వవిద్యాలయాల్లో విద్యపై దాడికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాల్లో పాలు పంచుకున్నది. విద్యార్థి సంఘాల ఎన్నికల్లో కొన్ని కీలకమైన విజయాలు సాధించింది. కార్మిక రంగంలో బిఎస్ఎన్ఎల ఉద్యోగులు–అధికార్లు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒక రోజు సమ్మె చేశారు. బ్యాంకు ఉద్యోగులు–అధికార్లు, మెడికల్–సేల్స్ రీప్రెజెంటేటివ్స్, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు. పబ్లిక్ రంగంలో సెయిల్ ఉద్యోగులు దుర్గాపుర్, భద్రావతి మరియు సేలంలో ఏప్రిల్ 11న ఒక రోజు సమ్మె చేశారు. పబ్లిక్ రంగ ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇంకా సమ్మెలు జరిగే అవకాశం ఉన్నది.

కర్నాటక, తమిళనాడులో పెద్ద కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. బెంగుళూరులో అంగన్వాడీ మహిళలు మూడు రోజుల సిట్-ఇన్ చేసి వర్కర్లు, హెల్పర్లు కోసం మంచి వేతనం సాధించారు.

రాజస్థాన్‌లో రైతుల సమస్యలపై కిసాన్ సభ భారీ ఆందోళన చేసింది. అలాగే అసోంలో కార్మిక సంఘాలతో కలిసి కిసాన్ సభ ఎన్నో పోరాటాలు చేసింది. హర్యానాలో రాష్ట్ర రావాణా ఉద్యోగులు శిక్షలు ఎదుర్కొంటూ కూడా మూడు రోజులు సమ్మె చేసి ప్రైవేటు ఆపరేటర్లకు ప్రభుత్వం ఇచ్చిన పర్మిట్లను రద్దు చేయించారు.

## కేంద్ర కమిటీ పిలుపులు

ఈ కార్యక్రమాలతో పాటు, ప్రజల మధ్య ప్రచారం చేపట్టమని, వివిధ వామపక్ష, ప్రజాస్వామిక శ్రేణులతో సహా పైన చర్చించిన అంశాలపై నిరసన కార్యక్రమాలను ప్రారంభించమని అన్ని శాఖలకు కేంద్ర కమిటీ పిలుపు ఇస్తున్నది.

హిందూత్వ ఎజెండా దూకుడుగా ముందుకు తీసుకుపోయే తీరు, మతపరమైన మైనారిటీలు, దళితుల పరిరక్షణ, ప్రజా బాహుళ్యంపై రుద్దబడుతున్న క్రమవర్ధమాన ఆర్థిక కష్టాలపైనే ప్రధానంగా శ్రద్ధ పెట్టాలి. ఇందుకు రాష్ట్ర కమిటీలు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితికి అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలి.

సిపియం రాష్ట్ర కమిటీలు ప్రజలను అత్యధికంగా కష్టాలపాలుచేసే ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా మే నెల ఉత్తరార్ధంలో నిరసన కార్యక్రమాలు ఒక వారంపాటు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఇది ఈ క్రింది విషయాలపై కేంద్రీకరిస్తుంది;

(ఏ) ఆహార భద్రతా చట్టాన్ని కాదంటూ ప్రజా పంపిణీ వ్యవస్థకు కేటాయింపుల్లో భారీ కోత, చక్కెర, కిరోసిన్ ప్రజాపంపిణీ వ్యవస్థ నుండి ఉపసంహరించటం జరిగింది.

(బి) గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు భారీగా తగ్గించారు. కేంద్రం రాష్ట్రాలకు పూర్తి 100 రోజుల పని ఇవ్వటానికి తగినన్ని నిధులు సమకూర్చాలి.

(సి) ప్రైవేటీకరణ దిశగా దూకుడు ఇప్పటికే తగ్గు ముఖంలో ఉన్న ఉపాధి పరిస్థితిని ఇంకా దిగజారుస్తున్నది.

(డి) ఘనీభవిస్తున్న వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాలంటే బిజెపి ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ అనగా పంటకు అయే ఖర్చుకి 1.5 రెట్లు కనీస మద్దతు ధరగా ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ఈ లోగా రుణ మాఫీలు కొంత తక్షణ ఊరటను ఇస్తాయి. కానీ ఇది వ్యవసాయ సంక్షోభానికి, భారత రైతుల సంక్షేమానికి దీర్ఘకాలిక పరిష్కారం కాదు.

ఈ నాలుగు అంశాలపై సిపియం దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించి, ప్రజా ఉద్యమాలను ప్రారంభిస్తుంది.

## ఎన్నికల సంస్కరణలు మతతత్వానికి వ్యతిరేకంగా సదస్సులు

కేంద్ర కమిటీ రెండు వేరువేరు సదస్సులు నిర్వహించటానికి చొరవ తీసుకోవాలని నిర్ణయించింది.

ఎన్నికల సంస్కరణలు మరియు రాజకీయ నిధులు ఇవ్వటానికి సంబంధించి ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు, అవినీతిని చట్టబద్ధం చేయటం, దీనివల్ల ధనబల ప్రభావం కొనసాగటం దామాషా పాక్షిక దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ప్రవేశపెట్టే అవసరం వగైరాలపై సదస్సు.

ఆర్ఎస్ఎస్, బిజెపిల కొత్త దూకుడు చర్యల దృష్ట్యా కేంద్ర కమిటీ ఒక మతతత్వ వ్యతిరేక సదస్సు నిర్వహించటానికి చొరవ తీసుకోవాలని నిర్ణయించింది.

## కాశ్మీర్

కేంద్ర కమిటీ జమ్మూ కాశ్మీరులో ఉన్న పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది నివేదికలో ఇవ్వడం జరిగింది. కాశ్మీర్ పరిస్థితిపై కలిసొచ్చే రాజకీయ శక్తులు, మేధావులు, సామాజిక ఉద్యమాలతో సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది.

## మహిళా రిజర్వేషన్

మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరగా ఆమోదించడాన్ని సునిశితం చేసే హామీపై బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తున్న మోసానికి వ్యతిరేకంగా కేంద్రం ఈ బిల్లు రాబోయే వర్షాకాల సమావేశంలో ఆమోదించాలని డిమాండు చేస్తూ నిరసన దినం పాటించాలని నిర్ణయించింది. రాజ్యసభ ఈ బిల్లును గతంలోనే ఆమోదించింది. ఇప్పుడు లోక్‌సభలో స్పష్టమైన మెజారిటీ ఉన్నా బిజెపి ఈ బిల్లును ఆమోదింపచేయటానికి నిరాకరిస్తున్నది. ఇది వారు చేసిన వాగ్దాన భంగమే.


ముద్రణ : మే, 2017 వెల : ₹.10/-

**ప్రచురణ**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్

**ప్రతులకు**

ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533, సెల్ : 9490099202

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ